జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను
ఆశ్రయించిన గిరిజన మహిళ
- అట్రాసిటీ కేసుపై ఇల్లెందు డీఎస్పీ విచారణ

7

కోతులు, కుక్కల స్వైరవిహారం
- ముదిగొండ మండలంలో నలుగురికి, బూర్గంపాడులో ఒకరికి గాయాలు

భద్రాద్రి వారధికి 60 ఏళ్లు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- ఇవాల్టి రోజున వంతెనను ప్రారంభించిన అప్పటి రాష్ట్రపతి రాధాకృష్ణన్
- 1960-65 మధ్య రూ.70లక్షలతో నిర్మాణం
- 1986 మహా వరదలనూ తట్టుకున్న గోదావరి బ్రిడ్జి

నాడు వానరులు నిర్మించిన వారధి ధర్మస్థాపనకు.. దుష్ట సంహారానికి.. సీతారాముల కలయికకు కారణమైంది. నేడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం వద్ద గోదావరిపై నిర్మించిన తొలి వారధి రాముడిని, రామభక్తులను అనుసంధానం చేసింది. 1956లో సీతారామ కల్యాణానికి భక్తులు పడవలో వస్తుండగా.. భద్రాచలం వద్ద గోదావరిలో ప్రమాదానికి గురయ్యారు. సుమారు 500మంది మృతిచెందడంతో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయి. వెంటనే వారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. 1960-65 మధ్య కాలంలో పూర్తయిన వారధిని అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించి రామభక్తులకు అంకితమిచ్చారు. ఈ మహాఘట్టం జరిగి.. ఆదివారానికి 60ఏళ్లవుతోంది. షష్టి పూర్తి చేసుకుంటున్న ఈ వంతెన భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధికి బాటలు పరిచింది. అలాగే సరిహద్దు రాష్ట్రాల వారి రాకపోకలకు ఆదరువై నిలిచింది.

7

- భద్రాచలం, ఆంధ్రజ్యోతి



60ఏళ్ల నాడు గోదావరిపై నిర్మించిన వారధి

1965 జూలై 13న వంతెనను ప్రారంభిస్తున్న అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్

కొత్తగూడెంలో సైనిక్ స్కూల్
ఏర్పాటు చేస్తాం

- భద్రాద్రి జిల్లాకు విమానాశ్రయం మంజూరు కావాల్సిందే
- ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమాన్ని కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, చిత్రంలో కూనంనేని, తదితరులు

కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయిస్తామని, ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిందేనని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రేణుకా చౌదరి మాట్లాడుతూ గతంలో తాను కేంద్రమంత్రిగా పని చేసిన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను ప్రత్యేకంగా అభివృద్ధి చేశానని, అందులో భాగంగానే కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా తాను ప్రతిపాదించానని గుర్తు చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న భద్రాద్రిలో తప్పనిసరిగా విమానాశ్రయం ఏర్పాటు కావాల్సిందేనన్నారు. కొత్తగూడెంలో సైనిక్ స్కూల్‌ను తీసుకొస్తానని హామీ ఇచ్చారు. గతంలో కేంద్రీయ విద్యాలయం కొత్తగూడెం రావాలని ప్రతిపాదించానన్నారు. మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. అప్పట్లో విద్యాలయం కోసం అద్దె భవనాన్ని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయం ఈ జిల్లాలో నెల కొల్పితే స్థానిక ఉన్న విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా నూతన హంగులతో జరుగుతున్న కొత్తగూడెం రైల్వేస్టేషన్ మరమ్మతు పనులు వేగవంతం చేసేలా రైల్వేబోర్డు అధికారులకు సూచించినట్టు తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడబిడ్డలకు అందాల్సిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందు వరుసలో నిలిపేందుకు జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, మంత్రులు ఎంతో సహకరిస్తున్నారన్నారు. నియోజకవర్గానికి కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. అనంతరం మహిళలకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీతారామ' జలాలు..
సాగర్ ఆయకట్టుకు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పంటలను కాపాడేందుకు..

- సాగర్ ఆయకట్టుకు గోదావరి నీళ్లిచ్చాం
- 'సీతారామ'తో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమే ధ్యేయం
- త్వరలో భద్రాద్రి జిల్లాలో సీతారామ డిస్ట్రిబ్యూషన్ లైన్ ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నాగార్జునసాగర్ ఆయకట్టులో ఎండుతున్న పంటలను కాపాడేందుకు గోదావరి నీటిని విడుదల చేశామని, సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే తమ ధ్యేయమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నాగార్జున సాగర్ నుంచి జలాల విడుదలకు ఇంకా సమయం ఉండటంతో అప్పటిలోపు పంటలను కాపాడేందుకు ముందుగానే గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు భూములకు విడుదల చేశామన్నారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో శనివారం (మిగతా 6వ పేజీలో)



పంప్‌హౌస్ నుంచి లింక్ కెనాల్ ద్వారా సాగర్ కాలువకు తరలుతున్న గోదావరి జలాలు

- ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా ఎన్నెస్పీ కాలువకు నీటి విడుదల
- నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించిన తుమ్మల
- యూటీ పనులతో పాలేరు నీటి విడుదలలో జాప్యం

ఖమ్మం/ కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొన్ని రోజులుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు నుంచి సాగర్ ఆయకట్టుకు నీరందిస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా సీతారామ నీటిని విడుదల చేశారు. దీంతో రైతులకు కొంత మేర ఉపశమనం లభించింది. వర్షాలు సమృద్ధిగా లేక సాగర్ ఆయకట్టులో పంటలు ఎండిపోతుండగా.. సాగర్ నుంచి కొంతమేరైన నీటిని అందించాలంటూ శనివారం పలువురు రైతులు తమ సమస్యను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించారు. ఆ తర్వాత ఇరుజిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్, నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి సీతారామ నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద వరినారుమళ్లు పలు చోట్ల ఎండిపోవడంతో చెరువుల్లో నీరు లేక వెలవెలబోతున్నాయి. గతేడాది రూ.90కోట్లతో నిర్మించిన ఏన్కూరు రాజీవ్ లింక్‌కెనాల్ నుంచి గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానం చేయడంతో సీతారామ ప్రధాన కాలువ 100కి.మీ నుంచి జూలూరుపాడు మండలం వినోభానగర్ ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా సాగర్ ప్రధాన కాలువలో గోదావరి జలాలు అనుసంధానమయ్యే అవకాశం ఏర్పడింది. ఈ రెండు నదుల జలాల అనుసంధానంలో పట్టిసీమలా సాగర్ ఆయకట్టుకు (మిగతా 6వ పేజీలో)

'బీజీ కొత్తూరు' నుంచి
1,500 క్యూసెక్కులు

- తుమ్మల చొరవ, ఉత్తమ్ ఆదేశాలతో ఎన్నెస్పీ పరిధిలోని భూములకు విడుదల
- లిఫ్ట్ మోటార్ ఆన్‌చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం



6

గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయం

ముగిసిన
ప్రక్రియ

- నియోజకవర్గాల వారీగా అభిప్రాయాల సేకరణ
- కాంగ్రెస్ పదవులకు ఆశావహుల జాబితాలు సిద్ధం
- హైదరాబాద్‌లో తుది కసరత్తు


ఖమ్మం, జూలై 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు ప్రభుత్వ నియామక పదవులు, పార్టీ సంస్థాగత పదవుల్లో నియమించేందుకు నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ పూర్తయింది. గతానికి భిన్నంగా ఈ సారి ఎలాంటి అలజడులు, ఘర్షణలు లేకుండా సమీక్షలు జరగడం చెప్పుకోదగిన విషయం. ప్రభుత్వ నియామక పదవులకు సంబధించి నియోజకవర్గాల్లో ఇద్దరికంటే పేర్లు సూచించమని అధిష్ఠానం ఆదేశించింది. అయితే ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకుల సూచనలతో ఒక్కో నియోజకవర్గాల్లో పది నుంచి 15మంది ఆశావహుల పేర్లు వచ్చాయి. కొందరు నేరుగా తమకు పార్టీలో సుదీర్ఘకాలంగా కష్టపడ్డామని, పదవులు ఇవ్వాలని దరఖాస్తు చేశారు. మరోవైపు ఉమ్మడిజిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు కూడా ఒక్కో మండలానికి ఐదు పేర్లు సూచించారు. అందులో వడపోత ప్రక్రియ కూడా మొదలు కాబోతుంది. పార్టీ ఖమ్మం జిల్లా (మిగతా 6వ పేజీలో)

ఆదివాసీల ఇళ్లకు వెలుగులు

- దర్తీ అభా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కింద విద్యుద్దీకరణ పనులు
- ఉమ్మడి జిల్లాకు రూ.16.74కోట్ల కేంద్ర నిధులు

జిల్లా	హ్యాబిటేషన్లు	లబ్ధి జరిగే వారి సంఖ్య	నిధులు
భద్రాద్రి	248	3,159	రూ.15.87 కోట్లు
ఖమ్మం	51	259	రూ.87లక్షలు

భద్రాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఏజెన్సీ ఆదివాసీల గ్రామాల ప్రజల ఇళ్లలో వెలుగులు నిండనున్నాయి. కేంద్ర ప్రభుత్వ దర్తీ అభ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం (డీఏ-జుగా) కింద విద్యుద్దీకరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 1,132 హ్యాబిటేషన్లలో 24,538 ఆదివాసీల ఇళ్లకు రూ.107.14కోట్లతో విద్యుద్దీకరణ పనులకు చేయనుండగా.. ఆ జిల్లాల జాబితాలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కూడా ఉంది. ఇందులో భద్రాద్రి జిల్లాలో రూ.15.87 కోట్లతో 248 హ్యాబిటేషన్లలో 3,159 మంది ఆదివాసీల ఇళ్లకు త్వరలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. అలాగే ఖమ్మం జిల్లాలో 51 హ్యాబిటేషన్లలో 259 ఆదివాసీ ఇళ్లకు రూ.87లక్షలతో పనులు చేయనున్నారు. అయితే 50 శాతానికి పైగా ఆదివాసీలు నివసించే హ్యాబిటేషన్లలో ఈ విద్యుద్దీకరణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. భద్రాద్రి జిల్లాలో 10.10కి.మీ మేర 11 కేవీ లైను ఏర్పాటు చేయనున్నారు. అలాగే 123.75 కి.మీ మేర 6.3 కేవీ లైను, 1.40 కి.మీ.లు ఎల్‌టీ త్రీఫేజ్ ఫైవ్ వైర్ లైను, 199.38 కి.మీలు ఎల్‌టీ సింగిల్ ఫేజ్ త్రీ వైర్ లైన్ చేపట్టనున్నారు. అలాగే త్రీఫేజ్ 63 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) 1, త్రీఫేజ్ 25 కేవీఏ డీటీఆర్‌లు 12, ఎస్‌పీహెచ్ 25 కేవీఏ డీటీఆర్‌లు 257 ఏర్పాటు చేయనున్నారు. ఇక ఖమ్మం జిల్లాలో 6.26 కి.మీ మేర 6.3కిలో వాట్ విద్యుత్ లైను ఏర్పాటు చేయనున్నారు. 15.70 కి.మీ. ఎల్‌టీ సింగిల్ ఫేజ్-3 వైరు లైను, 10 సింగిల్ ఫేజ్ 25 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరలో ముగియనుందని ఎన్‌పీడీసీఎల్ భద్రాద్రి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు గొట్టిముక్కుల మహేందర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఒప్పందం అనంతరం ఆగస్టు మొదటి వారం నుంచి సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టనున్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని 579 ఆదివాసీ గ్రామాల్లో ఇప్పటికే విద్యుద్దీకరణ పనులు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.





పామాయిల్ మొక్కను నాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గౌరవప్రదంగా బతికేది రైతే

- వారి సంక్షేమానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోంది
- నవంబరు నాటికి గోద్రెజ్ ఫ్యాక్టరీని పూర్తిచేయాలి
- జిల్లాలో వక్కసాగుకు చర్యలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అంజనాపురం ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌కు హాజరు

6

తగ్గుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద గరిష్ఠంగా 41.3 అడుగులు నమోదు
- 4 గంటల పాటు నిలకడగా.. ఆపై తగ్గుముఖం

6





భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

తగ్గుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద గరిష్టంగా 41.3 అడుగులు నమోదు
- 4 గంటల పాటు నిలకడగా.. ఆపై తగ్గుముఖం

భద్రాచలం/దుమ్ముగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ భాగాన కురిసిన వర్షాలతో భద్రాచలంలో గత 48 గంటలుగా పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం శనివారం మధ్యాహ్నం 1గంటకు 41.3 అడుగులకు చేరుకుంది. అనంతరం నాలుగు గంటల పాటు అదే నీటిమట్టం వద్ద నిలకడగా ఉంది. కాగా సాయంత్రం 6 గంటలకు 41.2 అడుగులకు తగ్గింది. కాగా గోదావరి స్నానఘట్టాలు, రేకుల షెడ్డు నీటమునిగాయి. ఇదిలా ఉండగా గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతుందని అధికారులు తెలిపారు. ముందస్తుగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

పర్ణశాల వద్ద...

దుమ్ముగూడెంవద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. శనివారం పర్ణశాల నారచీరల వద్ద సీతమ్మవారి విగ్రహం పూర్తిగా మునిగిపోగా, దుకాణాల వద్దకు వరదనీరు చేరింది. అలాగే సున్నంబట్టి-బైరాగుల పాడుల మధ్య లోలెవల్ చప్టా వద్ద వరదనీరు పోటెత్తింది. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మండలానికి చేరుకోగా దుమ్ముగూడెం ఎస్సీ హాస్టల్లో వారికి ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వర్లు, నర్సింహారావులు వసతి సదుపాయం కల్పించారు. శనివారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుముఖం పడుతూ వస్తోంది.



నారచీరల వద్ద ముంపునకు గురైన దుకాణాలు

గౌరవప్రదంగా బతికేది రైతే

- వారి సంక్షేమానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోంది
- ఆయిల్‌పాం సాగుకు యోగ్యంగా రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు
- నవంబరు నాటికి గోద్రెజ్ ఫ్యాక్టరీని పూర్తిచేయాలి
- ఇక్కడే సీడ్‌గార్డెన్, రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి
- జిల్లాలో వక్కసాగుకు చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అంజనాపురం ఆయిల్‌పాం ప్లాంటేషన్ డ్రైవ్‌కు హాజరు

కొణిజర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో గౌరవప్రదంగా బతికేది రైతులు మాత్రమేనని, అలాంటి రైతుసంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కొణిజర్ల మండలం అంజనాపురం సమీపంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడారు. పామాయిల్ సాగు రాష్ట్రంలో 20లక్షల ఎకరాలు యోగ్యంగా ఉన్నాయని, రైతులకు నాణ్యమైన పామాయిల్ మొక్కలను అందించేందుకు, సీడ్‌గార్డెన్ ఏర్పాటు కోసం గోద్రెజ్ లాంటి మల్టీనేషనల్ కంపెనీతో దావోస్‌లో సీఎం సంతకాలు చేశారన్నారు. రైతుల కోసం ఆలోచించే ప్రభుత్వం ఉందంటే అది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనని, దేశంలో ఎక్కడా సీడ్ ఫ్యాక్టరీ లేదని ఇక్కడ ఏర్పాటు చేసేలా సీఎం పట్టుదలతో ఉన్నారన్నారు. నవంబర్ నాటి ఈ ఫ్యాక్టరీని ప్రారంభించాలని, నిర్లక్ష్యం, ఆలస్యం చేయొద్దని కోరారు. ఫ్యాక్టరీ ఉన్నచోటనే సీడ్‌గార్డెన్ ఉండేలా చూడాలన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి 18నెలల్లో రూ.లక్షా ఐదు వేల కోట్లను ఖర్చు చేశారన్నారు. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుభరోసా నిధులు విడుదల చేశామన్నారు. ఇక వక్కసాగుకు ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టామని, వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో డివైడర్ల మధ్య వక్క మొక్కలను వేయాలని సూచించారు. తాను వక్కసాగు చేస్తున్నానని.. అది విజయవంతమయ్యాక రైతుల్లోనూ చైతన్యం తీసుకొస్తానని తెలిపారు. వక్కసాగు లాభం కూడ అధికంగా ఉంటుందన్నారు. 60సంవత్సరాల పాటు దిగుబడిని ఇస్తుందన్నారు.



హాజరైన రైతులు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఫ్యాక్టరీ పెట్టకపోతే రైతులతో భూమిని దున్నేస్తాం: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

పామాయిల్ ఫ్యాక్టరీ కోసమని భూమిని సేకరించి 18 ఏళ్లవుతుందని.. మంత్రి ఎదుట ఇచ్చిన హామీ మేరకు నవంబరు నాటికి ఫ్యాక్టరీని ప్రారంభించకపోతే రైతుల దగ్గర తీసుకున్న భూమిని మొత్తాన్ని దున్నేస్తామని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. మంత్రి తుమ్మల చొరవతో రైతులంతా పామాయిల్ వేసేందుకు ముందుకు వస్తున్నారని, తను కూడా పామాయిల్ వేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కంపెనీ వారు రైతులను మోసం చేయకుండ ఫ్యాక్టరీని నిర్మించాలని, రైతులకు నాణ్యమైన మొక్కలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి. ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఖమ్మం మార్కెట్‌కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్, వ్యవసాయాధికారి పుల్లయ్య, గోద్రెజ్ ఆగ్రోవెట్ హెచ్ఆర్ వెంకటేశ్వర్లు, సొసైటీ సలహాదారు నల్లమల వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్‌కు అంబాసిడర్‌గా తుమ్మల.. రైతుల కితాబు

గతంలో పామాయిల్ సాగు అంటే ఏమీ తెలియదని, మంత్రి తుమ్మల ఇచ్చిన సలహాలతో పామాయిల్ సాగు చేపట్టి లాభాలవైపు వెళుతున్నామని, ఆయన తెలంగాణ పామాయిల్ అంబాసిడర్‌గా మారారని రైతులు కితాబిచ్చారు. అవగాహన సదస్సులో పలువురు రైతులు తమ సమస్యలను తుమ్మల దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌వోఎఫ్ఆర్ పరిధిలో సాగు చేయడంతో విద్యుత్‌కు, డ్రిప్‌కు ఇబ్బందవుతుందని తెలపగా వెంటనే మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పరిధిలో సేద్యం చేస్తుంటే వారికి కావల్సిన సౌకర్యాలు అందేలా చూడాలని కలెక్టర్‌ను, విద్యుత్‌శాఖ డీఈఈ రామారావును ఆదేశించారు. రైతులు కూడా డ్రిప్ వచ్చిన తర్వాతనే మొక్కలు వేయాలని తెలిపారు.

జిల్లాలో సాగు లక్ష్యాన్ని చేరుకుంటాం: కలెక్టర్

ఖమ్మం జిల్లాలో 5,500 ఎకరాలు పామాయిల్ సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 4వేలు ఎకరాలు పూర్తయిందని తెలిపారు. జిల్లాకు పెట్టకున్న లక్ష్యాన్ని పూర్తిచేస్తామన్నారు. రైతుల చెప్పిన సమస్యను రెండు రోజుల్లో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

మెగా ఆధార్ క్యాంపులకు విశేష స్పందన

- మొత్తం 3,700 సమస్యలకు పరిష్కారం
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మూడు రోజుల మెగా ఆధార్ క్యాంపులకు ప్రజలనుంచి విశేష స్పందన లభించిందని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన ఈ మెగా క్యాంపు ద్వారా వేలాదిమంది పౌరులు తమ ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకున్నారన్నారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్‌క్యాంపు ద్వారా మొత్తం కొత్త నమోదులు-489, వయోవృద్ధుల సేవలు 45, వికలాంగుల నమోదు 12, ట్రాన్స్ జెండర్స్ నమోదు 1, బయోమెట్రిక్, ఇతర అప్డేట్లు 602, జనన తేదీ సవరణలు 5, ఆధార్ రద్దు కేసులు 2 సాధారణ ఎంక్వైరీలు, సుమారు 50, మొత్తం 3,772 సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్ క్యాంపునకు పదివేలకుపైగా ప్రజలు వచ్చారని ఆయన తెలిపారు. వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి సరైన ధ్రువీకరణ పత్రలతో మీ-సేవ కేంద్రాల ద్వారా నవీకరణ చేసుకోవాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోని ఎన్నో ఆధార్ సమస్యలను ఈ ఆధార్ కేంద్రం ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు. మండలాలవారీగా నిర్వహించే మెగా ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఆధార్ క్యాంపు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన రాష్ట్ర యూఐడీఐ బృందం, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సైదేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, ఐటీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవగా సువర్ణ తులసి అర్చన నిర్వహించారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో రామయ్యను దర్శించుకున్నారు. కాగా స్వామి వారికి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్ర బెల్లం, శుభ ముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాలు అనంతరం చివరగా వేద ఆశీర్వచనంతో కల్యాణ ప్రక్రియ ముగిసింది.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మోటార్లతో వృథా నీరు గోదావరిలోకి ఎత్తిపోత

1420 హెచ్‌పీ సామర్థ్యం గల 14 మోటార్లు ఏర్పాటు

భద్రాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులు దాటి ప్రవహిస్తుండంతో నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా కరకట్ట స్లూయిస్‌లకు ఉన్న షట్టర్లను మూసివేశారు. ఈ క్రమంలో పట్టణంలోని వృథా నీటిని 1420 హెచ్‌పీ సామర్థ్యం గల 14 మోటార్లతో గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. విస్తా కాంప్లెక్సు వద్ద 1100 హెచ్‌పీ సామర్థ్యం గల పది మోటార్లు, రెడ్డి సత్రం వద్ద 250 హెచ్‌పీ సామర్థ్యం గల ఒక మోటారు ఏర్పాటు చేశారు. అలాగే అశోకనగర్ కొత్తకాలనీ స్లూయిస్ వద్ద 70 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా అశోకనగర్ కొత్తకాలనీలో ఇటీవల కరకట్ట పక్కన ఉన్న నివాసాల వారిని ఖాళీ చేయించి వారికి డబుల్‌బెడ్‌రూంలు కేటాయించారు. దీంతో ఆ ప్రాంతంలో చాలా వరకు వరద ముంపు సమస్య తప్పుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

పంటలను కాపాడేందుకు..

(5వ పేజీ తరువాయి)

ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. మే నెలలో కురిసిన వర్షాలతో వరి నారుమళ్లు పోసిన రైతులు ఇబ్బందులు పడుతుండడంతో నీటి పారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి సాగర్ ఆయకట్టులో వరి నారుమళ్లను కాపాడేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయించినట్లు మంత్రి వివరించారు. సాగర్ ఆయకట్టు ద్వారా గోదావరి నదీజలాలు వైరా, తల్లాడ, పెనుబల్లి, కల్లూరు మండలాలకు రెండు, మూడు రోజుల్లో అందుతాయన్నారు. సీతారామ జలాలతో భూగర్భజలాలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గోదావరి జలాలకు అందించేందుకు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు కూడా సిద్ధం చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్కొక్క నియోజకవర్గంలో 20నుంచి 40వేల ఎకరాల వరకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందచేసేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు ద్వారా పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో 1.50లక్షల ఎకరాలకు గోదావరి జలాలను అందచేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరగా వెంటనే స్పందించి నీటిని విడుదల చేయడం పట్ల మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. సాగర్ నీరు లేక పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందకూదని గోదావరి జలాలను విడుదల చేసినట్లు తెలిపారు. వర్షాధారంపై ఆధారపడిన అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, వైరా, భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో పంటలు సస్యశ్యామలం చేసేందుకు కూడ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లకు త్వరలో శ్రీకారం చూడతామన్నారు. విలేకరుల సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీతారామ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఎన్‌పీడీసీ ఎస్ఈ మహేందర్, డీఏవో బాబురావు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో జయలక్ష్మి, సీపీవో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

‘సీతారామ’ జలాలు.. సాగర్ ఆయకట్టుకు

(5వ పేజీ తరువాయి)

గోదావరి జలాలు వినియోగించే మార్గం సులభమైంది.

రైతుల వినతి.. తుమ్మల చొరవ..

సాగునీటి కోసం రైతులు చేసిన వినతితో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి గోదావరి జలాలను సీతారామా ద్వారా విడుదల చేయించేందుకు అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత సీతారామ ఎత్తిపోతల ద్వారా గోదావరి నీరు విడుదల చేయాలని మంత్రి తుమ్మల ఆదేశాలు ఇవ్వడంతో పాటు ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్‌లకు పర్యవేక్షించాలని ఆదేశించారు. బీజీ కొత్తూరు వద్ద మొదటి పంప్‌హౌజ్ ద్వారా నీరు విడుదల చేయించడంతో గోదావరి జలాలు సీతారామ ఎత్తిపోతల ద్వారా విడుదలయ్యాయి. ఆ నీరు కమలాపురం, పూసుగూడెం నుంచి విడుదలై జూలూరుపాడు మండలానికి చేరి లింక్‌కెనాల్ ద్వారా ఏన్కూరువద్ద సాగర్ కెనాల్‌కు చేరనుంది. ఈ నీటి ద్వారా కల్లూరు, సత్తుపల్లి, వేంసూరుతో పాటు మధిర నియోజకవర్గాల వైపు కూడా గోదావరి జలాల ద్వారా సాగర్ ఆయకట్టులోని నారుమడులు, చెరువులకు నీరు అందనుంది. ఎండిపోతున్న నారుమడులకు ప్రాణం పోయనుంది. అలాగే ప్రధాన కాలువలో పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేటలోని పలు మండలాలకు మోటార్లు, ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని పొలాలకు మళ్లించే సౌకర్యం ఉంది. సుమారు లక్షన్నర ఎకరాల వరకు గోదావరి జలాలతో రైతులు పంటలు కాపాడుకునే సౌలభ్యం కలగనుంది.

సస్యశ్యామలమే నా లక్ష్యం : మంత్రి తుమ్మల

గోదావరి జలాలతో సీతారామ ప్రధానకాలువకు ఇరువైపులా మండలాలకు సాగర్ ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా సాగునీరు విడుదల చేయించడం జరిగిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రాజెక్టు మొత్తం పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో చివరి భూములకు కూడా సాగునీరు అందబోతుందని, సాగర్ ఆయకట్టుతోపాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పూర్తి చేయడంతో మెట్టభూములకు సాగునీరు అందనుందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సీతమ్మ సాగర్ ద్వారా పనులు కూడా పూర్తిచేయడం ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సీతారామ ద్వారా గోదావరి జలాలు రైతులు వేసిన పంటలను ఆదకునే అవకాశం లభించిందని తెలిపారు. ప్రస్తుతం కృష్ణాజలాలు పాలేరు నుంచి విడుదల కావడానికి కొంత జాప్యం ఉన్నందున ఈలోపు పంటలను కాపాడేందుకు గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టుతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానకాలువల వెంట ఉన్న భూములకు కూడా నీటి సదుపాయం లభించబోతుందని మంత్రి తుమ్మల వివరించారు.

పాలేరు నిండినా.. నీటి విడుదలలో జాప్యం

పాలేరు జలాశయంలో ప్రస్తుతం సాగర్ నుంచి నీరు వస్తుండగా మొత్తం 23 అడుగులకుగాను 20.5అడుగులు ఉంది. అయితే అక్కడ గతేడాది వరదల్లో కొట్టుకుపోయిన యూటీ పనులు ఇంకా జరుగుతున్నాయి. దీంతో ఎడమకాలవకు నీటి విడుదలలో మరింత జాప్యం జరుగుతోంది. ప్రత్యామ్నాయంగా ఎడమకాలువ లో కొంత భాగానికి ఏన్కూరు లింక్ కెనాల్ ను ంచి గోదావరి జలాలను వినియోగించబోతున్నారు.

‘బీజీ కొత్తూరు’ నుంచి 1500క్యూసెక్కులు

అశ్వాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు శనివారం సీతారామా ప్రాజెక్ట్ బీజీ కొత్తూరు మొదటి పంప్‌హౌస్ నుంచి అధికారులు గోదావరి జలాలను విడుదల చేశారు. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కానుండటంతో పాటు, సాగర్‌ఎడమ కాలువ పరిధిలో తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడటంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు విజ్ఞప్తి మేరకు నీటిపారుదలశాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు గోదావరి జలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మోటార్ స్విచ్ ఆన్‌చేసి ఎత్తిపోతలను ప్రారంభించారు. ప్రస్తుతం 1500 క్యూసెక్కుల నీటిని సాగర్ ఆయకట్టుకు విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే గోదావరి జలాలకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృథాగా పోతున్న గోదావరి జలాలను సీతారామా ప్రాజెక్ట్ నుంచి సాగర్‌కెనాల్‌కు నీటిని వదలి ఎండిపోతున్న పంటలకు సాగునీరు విడుదల చేసినట్లు తెలిపా రు. కాగా అధికారులు మొదటగా సీతారామా ప్రాజెక్ట్ బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నాలుగో మోటార్ ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేశారు. అయితే అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మొదటి మోటారు నుంచి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ భద్రాచలం ఎస్ఈ రవికుమార్, ఈఈ తెల్లం వెంకటేశ్వర్లు, సీతారామా డీఈ శ్రీనివాసరావు, ఏఈ రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ ‘అరుణ’తార

- ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్న వనిత
- జ్యూట్ బ్యాగుల తయారీతో ఉపాధి కూడా..

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి పెరిగిన గ్రామీణ ప్రాంత వాతావరణం ఆమెను ప్రకృతి ప్రేమికురాలిగా మార్చింది. ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఆమె పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. అందుకు తోడుగా ఆమె జ్యూట్ బ్యాగుల తయారీని ఎంచుకుంది. తొలుత గ్రామంలో ప్రారంభించగా ఆదరణ లేక పోవటంతో ఖమ్మం నగరానికి చేరుకుని.. ఒక వైపు ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తూనే.. మరో వైపు జ్యూట్ బ్యాగుల వ్యాపారాన్ని విస్తరిస్తూ వస్తోంది. అలా పర్యావరణ పరిరక్షణకు తోడ్పటంతో పాటు.. మరో వైపు జ్యూట్ బ్యాగుల తయారీతో ఉపాధి పొందుతూనే తనతో పాటు మరి కొందరికి ఉపాధి చూపుతోంది. ఈ క్రమంలో ఎందరో ప్రశంసలు అందుకుంటోంది ఖమ్మం నగరానికి చెందిన పాకాలపాటి అరుణ.

చిన్నప్రయత్నంగా ప్రారంభం..

వైరా మండలం స్టేజీ పినపాకలో జన్మించిన అరుణ పర్యావరణంపై ఉన్న ప్రేమతో ఎంఎస్సీ, ఆర్గానిక్ సైన్స్ బీఈడీ పూర్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతగా 2020లో జ్యూట్‌బ్యాగ్‌ల తయారీకి ఓ చిన్న ప్రయత్నం చేశారు. స్వగ్రామం పినపాకలో జ్యూట్ బ్యాగ్‌ల తయారీ ప్రారంభించారు. కానీ గ్రామంలో ఆదరణ లేకపోవడంతో ఖమ్మం వచ్చిన ఆమె పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్‌బ్యాగ్‌లను వినియోగించాలని విస్తృత ప్రచారం చేశారు. తొలుత మహిళ స్వయం సహాయక సంఘం ద్వారా రూ.2లక్షల రుణం తీసుకొని జ్యూట్ వ్యాపారాన్ని విస్తరించారు. ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు, హాస్పిటల్స్, హోటల్స్, పుట్టిన రోజు వేడుకలు, ఈవెంట్స్‌కు జూట్ సంచులను ఆర్డర్లు తీసుకొని.. వారు కోరిన విధంగా పేర్లు, లోగోలు, చిత్రాలు ముద్రిస్తూ జ్యూట్ బ్యాగ్‌లు అమ్మకాలు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.



జూట్ బ్యాగ్ తయారు చేస్తున్న అరుణ

అవార్డు.. అభినందన

మహిళా సంఘాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన అరుణ.. ఇటీవల రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ నుంచి పర్యావరణ పరిరక్షణ అవార్డును అందుకున్నారు. ఇదే క్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆమెను అభినందించారు. ప్లాస్టిక్ ఫ్రీ ఖమ్మం జిల్లాగా మారేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని తుమ్మల ఆమెకు సూచించారు.





అరుణను అభినందిస్తున్న మంత్రి తుమ్మల (ఫైల్),అటవీ శాఖ మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తూ (ఫైల్)

ముగిసిన ప్రక్రియ

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి తోపాటు పలువురు పీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. మహబూబాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆ లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు అందరి జాబితాలను సిద్ధంచేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వంశీచంద్‌రెడ్డితో కలిసి తమ నియోజకవర్గాల పరిస్థితి. జిల్లాలో పార్టీ విషయాలను చర్చించారు. మొత్తంగా పరిశీకులు కూడా జిల్లాలో పార్టీ, రాజకీయ పరిస్థితులను ప్రాథమికంగా అంచనా వేశారు. ఏజెన్సీలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, సర్పంచ్‌లు, తదితర పదవులు గిరిజనేతరులకు రిజర్వు అవుతున్నందున ఏజెన్సీలో గిరిజనేతరులకు పార్టీ సంస్థాగత, ప్రభుత్వ నియామక పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు తెలిసింది. జిల్లాలో ఆయా సామాజికవర్గాలకు సుముచిత స్థానం కల్పించేలా సంస్థాగత పదవుల్లో ప్రాధాన్యమివ్వనుంది. పరిశీలనకు అభిప్రాయ సేకరణ పూర్తవడంతో ఇక ఆశావహులు హైదరాబాద్ కేంద్రంగా పదవులు దక్కించుకునేందుకు పైరవీలు చేపట్టబోతున్నారు.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

భద్రాద్రి వారధికి.. 60ఏళ్లు



భద్రాచలం వద్ద గోదావరిపై తొలి వారధి నిర్మిస్తున్న దృశ్యం(ఫైల్)

- ఇవాళ్టి రోజున వంతెనను ప్రారంభించిన అప్పటి రాష్ట్రపతి రాధాకృష్ణన్
- 1960-65 మధ్య రూ.70లక్షలతో నిర్మాణం
- 1986 మహావరదలనూ తట్టుకున్న గోదావరి బ్రిడ్జి

భద్రాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నేడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం వద్ద గోదావరిపై నిర్మించిన తొలి వారధి రాముడిని, రామభక్తులను అనుసంధానం చేసింది. 1956లో సీతారామ కల్యాణానికి పడవలో వస్తున్న 500మంది భక్తులు భద్రాచలం వద్ద గోదావరిలో ప్రమాదానికి గురై మృతిచెందారు. దాంతో స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయి. వెంటనే వారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. 1960-65 మధ్య కాలంలో పూర్తయిన వారధిని అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించి రామభక్తులకు అంకితమిచ్చారు. ఈ మహాఘట్టం జరిగి.. ఆదివారానికి 60ఏళ్లవుతోంది. షష్టి పూర్తి చేసుకుంటున్న ఈ వంతెన భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధికి బాటలు పరిచింది. అలాగే సరిహద్దు రాష్ట్రాల వారి రాకపోకలకు ఆదరువై నిలిచింది.



1986 ఆగస్టు 16న 75.6 అడుగుల నీటిమట్టం సమయంలో వారధి వద్ద గోదావరి ప్రవాహం

వంతెనకు బీజం పడిందిలా..

1956లో శ్రీరామనవమి రోజున సీతారామ చంద్ర స్వామి కల్యాణాన్ని తిలకించడానికి నాటు పడవల్లో బయల్దేరిన భక్తులు ప్రమాదానికి గురవగా.. సుమారు 500మంది మృతి చెందారు.

దీంతో భద్రాచలం ఏజెన్సీకి వారధి అవసరాన్ని గుర్తించిన అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1959లో వారధిని మంజూరు చేయగా.. అదే ఏడాది డిసెంబరు 16న అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఎన్ సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఐదేళ్లకు వారధి పూర్తవగా 1965 జూలై 13న అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. 3,934 అడుగులతో 37 పిల్లర్లతో ఈ వారధిని ముంబై కు చెందిన పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ నిర్మించగా.. రూ.70లక్షలు వెచ్చించారు.



2022 జూలై 16న భద్రాచలం వద్ద మహోగ్ర గోదావరి (ఇన్‌సెట్‌లో శంకుస్థాపన శిలాఫలకం)

ఏజెన్సీ ప్రగతికి బాటలు వేసిన వారధి

గతంలో భద్రాచలం రామయ్యను దర్శించుకునేందుకు రావాలంటే బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి గోదావరి దాటి రావాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఎంతో ప్రయాసలకోర్చి రామయ్య దర్శనానికి భక్తులు వచ్చేవారు. ఆ రోజుల్లో వందల సంఖ్యలోపే భక్తులు రాగా వారధి నిర్మాణం అనంతరం ఇటీవల కాలంలో ఆ సంఖ్య సాధారణ రోజుల్లో 15వేల నుంచి 30వేలు ఉంటుండగా ఉత్సవ సమయాలలో లక్ష దాటుతుండటం గమనించదగ్గ విషయం. కాగా భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఈ వారధి ద్వారా ప్రయాణిస్తుండటం విశేషం.

వారధి రాకతో అందరి కష్టాలు తీరాయి

● పొడిచేటి రామచంద్రాచార్యులు, విశ్రాంత ప్రధాన అర్చకులు, భద్రాద్రి దేవస్థానం



వారధి రాకతో ఈ ప్రాంతంలోని అందరి కష్టాలు తీరాయి. అంతకు ముందు వేసవి కాలం సమయంలో ఇసుకలో నడవాలంటే అవస్థలు ఇంతా అంత కాదు. అలాగే వానాకలంలో ఒండ్రుమట్టి జారి కింద పడేవారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నాటి ప్రమాదాన్ని గుర్తించి నిర్మించిన వారధి భద్రాద్రి రామాలయ అభివృద్ధికి అలాగే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం వేసింది. ఈ రోజుతో ఆ వారధికి 60 ఏళ్లు నిండాయంటే నమ్మశక్యంగా లేదు.

1986 మహా వరదలకు తట్టుకుని..

తొలి వారధి పలు రకాల ఉపయోగకారిగా నిలిచింది. ఈ వారధి ఏటా ఎన్నో వరదలను తట్టుకుని చెక్కుచెదరకుండా నిలిచింది. ముఖ్యంగా 1986 ఆగస్టు 16న వచ్చిన 75.6 అడుగుల ప్రవాహాన్ని తట్టుకుని మరీ నిలిచింది. నాటికీ నేటికీ అదే రికార్డుస్థాయి వరదగా ఉండగా.. 2022 జూలై16న వచ్చిన 71.3 అడుగుల ప్రవాహం రెండో రికార్డు. ఇలా మహాప్రవాహాలను తట్టుకుని నిలిచిన ఈ వంతెన ఆరు దశాబ్దాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్న స్థానికులు 'వారధికి జయహో' అంటున్నారు.



వారధికి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూలమాల వేస్తున్న స్థానికులు

అర్ధశతాబ్దం తరువాత మరో బ్రిడ్జి

మొదటి వారధిని నిర్మించిన అర్ధశతాబ్దం తర్వాత భద్రాచలంలో నూతనంగా గోదావరిపై రెండో వారధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న అవసరాలను గుర్తించి ప్రభుత్వం రెండో వారధిని మం జూరు చేయగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండారు దత్తాత్రేయ, తుమ్మల నాగేశ్వరరావు.. 2015 ఏప్రిల్ 1న శంకుస్థాపన చేశారు. విజయవాడ నుంచి జగదల్‌పూర్ జాతీయ రహదారిలో 166వ కిలోమీటరు వద్ద ఈ వంతెన నిర్మాణం జరిగింది. 2014లో టెండర్ల ప్రక్రియ జరగ్గా 2015 ఏప్రిల్ ఒకటిన పనులు ప్రారంభమయ్యాయి.

మొత్తం రూ.65కోట్లతో ఈ వంతెనను నిర్మించారు. గతేడాది ఏప్రిల్ 15న వద్ద రెండో వారధిని నాటి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ప్రారంభించారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని గచ్చీబౌలి, ఎల్.బి స్టేడియాలలో త్వరలో నూతనంగా ప్రారంభించనున్న హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, ఫుట్‌బాల్ అకాడమీలలో ప్రవేశాలకు గాను ఈనెల 15, 16 తేదీలలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు 12 నుంచి 16 సంవత్సరాల బాలురు, బాలికలు అర్హులని ఆయన తెలిపారు. గచ్చీబౌలి హాకీ అకాడమీలో 24 బాలురు, 24 బాలికలు మొత్తం 48 ఖాళీల భర్తీతో పాటు అథ్లెటిక్స్ అకాడమీలో 15 బాలుర, 15 బాలికల మొత్తం 30 ఖాళీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండాఎల్.బి స్టేడియంలోని హ్యాండ్‌బాల్ అకాడమీలో 14 బాలుర సీట్లు, ఫుట్‌బాల్ అకాడమీలో 24 బాలుర ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా అకాడమీలలో ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కొత్తగూడెం అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ 2025-26 విద్యాసంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర చారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు గడువు సోమవారంతో ముగుసున్న క్రమంలో ఆగష్టు 31 వ తేదివరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. చదువుకోవాలనే ఆసక్తి కలిగిన వారంతా మీ-సేవ, టీ-సేవ, తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొవచ్చని వివరించారు. రెండు సెట్ల దరఖాస్తు ఫారాలను అడ్మిషన్ తీసుకున్న ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌కు సమర్పించాలని, ఇతర వివరాలకు ఖమ్మం జిల్లా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సెల్ నెం. 8008403522ను సంప్రదించాలని కోరారు.

గోదావరి స్నానఘట్టాల వద్ద భద్రతా చర్యలు

- లోపలికి వెళ్లకుండా మెష్‌ను ఏర్పాటు చేసిన అధికారులు



మెష్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

భద్రాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి వద్ద వరద ప్రవాహం చోటు చేసుకుంటున్న క్రమంలో అధికారులు స్నానఘట్టాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. వరదొస్తుంటే ప్రమాదమని తెలిసినా .... జల్సాలా అనే శీర్షికన వెలువడిన కథనంకు అధికారులు స్పందించారు. ఈ క్రమంలో కరకట్టపై నుంచి స్నానఘట్టాలకు వెళ్లే మార్గంలో లోపలికి వెళ్లకుండా మెష్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఒక ఎస్సై స్థాయి అధికారితో పాటు సిబ్బందిని సైతం బందోబస్తు నిమిత్తం నియమించారు. కరకట్ట చుట్టూ పెట్రోలింగ్ సైతం నిర్వహిస్తున్నారు.

ఆరుగురు మావోయిస్టు దళసభ్యుల లొంగుబాటు



చెక్కు పంపిణీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం,జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సమక్షంలో శనివారం కొత్తగూడెంలోని పోలీస్‌హెడ్‌క్వార్టర్‌లో ఆరుగురు మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు మహిళా దళసభ్యులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యులకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున అందచేశారు. ఆధార్‌కార్డులు, బ్యాంకు ఎకౌంట్స్ వచ్చిన తర్వాత వారికి ఇవ్వాల్సిన రూ.10.75లక్షలను చెక్కుల రూపంలో అందజేస్తామన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో 23మంది..

చర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పోలీసుల ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయా రు. వీరిలో తొమ్మిది మంది మహిళలుండగా.. అందరిపై కోటి 18 లక్షల రివార్డు ఉందని సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం, పీపీసీఎం, ఏసీఎం కమిటీ సభ్యులున్నారని, వారితో పాటు నలుగురు దంపతులు కూడా లొంగిపోయారని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే గతంలో మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన మావోయిస్టు లీడర్ లోకేష్ కూడా ఉన్నాడని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరంతా నిందితులని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఛత్తీస్‌గడ్‌లో ఆపరేషన్ కగార్ జరుగుతుందని, మావోయిస్టులు లొంగిపోవాలని, లొంగిపోయిన వారిని ప్రభు త్వం ఆదుకుంటుందని, అన్ని వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు.

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన గిరిజన మహిళ

- అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



రజనీని విచారిస్తున్న డీఎస్పీ చంద్రభాను

జూలూరుపాడు, జూలై12 (ఆంధ్రజ్యోతి): కేసు విషయంలో పోలీసులు నిందితులకు అనుకూలంగా వ్యవహరించారని మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన భూక్యా రజని అనే గిరిజన మహిళ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించింది. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు ఈఏడాది జనవరి 12న తనఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇంటి పత్రాలు ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని తనతో పాటు తన కుటుంబ సభ్యులను బెదించటంతో పాటు కులం పేరుతో దూషించారని స్థానిక పోలీసులకు ఆమె మార్చి 22న ఫిర్యాదు చేసింది. దీంతో జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. కాగా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కేసును దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం తప్పుడు కేసుగా నిర్ధారించారు. ఈ క్రమంలో సదరు మహిళ తాను ఫిర్యాదు చేసిన వ్యక్తులకు అనుకూలంగా అధికారులు వ్యవహరించి కేసును కొట్టివేశారని ఆరోపిస్తూ జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించింది. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. దీంతో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ కేసును విచారించి నిజానిజాలను నిర్ధారించాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌ను ఆదేశించింది. జిల్లా ఎస్పీ కేసును విచారించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభానుకు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం డీఎస్పీ వెంగన్నపాలెం గ్రామంలో నేరస్థలాన్ని సందర్శించారు. ఫిర్యాదుదారురాలు రజనిని విచారించారు. అదేవిధంగా ఆమె ఫిర్యాదు చేసిన వ్యక్తులను కూడా విచారించారు. కేసుకు సంబంధించిన నివేదికను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ద్వారా జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు సమర్పిస్తానని ఆయన తెలిపారు.

వరదలపై ముందస్తు చర్యలకు ఉపక్రమించాలి

- ప్రయాణ, రవాణా మార్గాలు సులభతరం చేయాలి
- ముంపు నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు
- గోదావరి వరదలపై సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదలపై ముందస్తు చర్యలకు ఉపక్రమించాలని, గోదావరి నదిపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో కలెక్టర్ జితేష్ విపాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గోదావరి వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేస్తూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా సహాయ, పునరావాస శిబిరాలు ఏర్పాటుచేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రక్షణచర్యలు, సహాయ పునరావాస కార్యక్రమాల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహా సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర సేవల కోసం హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో గర్భిణుల రక్షణ కోసం ముందస్తు జాబితాను సిద్ధం చేసి వైద్యశాలలో చేర్పేవిధంగా చర్యలు తీసుకోవాలని, 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక వైద్యంపై సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలు పొంగుతాయని, ఈసమయంలో ప్రయాణ, రవాణా మార్గాలను సురక్షితంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులంతా రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదావరి వరద ఉధృతి, ముంపు పరిస్థితులపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ విద్యాచందన, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఎస్పీడిసియల్ మహేందర్, ఆర్అండ్‌బీ ఈఈ రమణారావు, డీఎంఅండ్‌హెచ్‌వో జయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, చీఫ్ ప్లానింగ్ అధికారి సంజీవరావు, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, కలెక్టరేట్ ఓఎస్‌డీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకట్‌రెడ్డి మృతదేహం

అశ్వాపురం,జూలై12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట పాలవాగు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందాడు. పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి(65) మణుగూరు నుంచి కారులో పాల్వంచ వెళుతున్నాడు. ఈక్రమంలో మొండికుంట పాలవాగు వద్ద వెంకట్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టంతో వెంకట్‌రెడ్డి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సంఘటనపై అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

కోతులు, కుక్కల స్వైరవిహారం

- ముదిగొండ మండలంలో నలుగురికి గాయాలు



నఫీసాకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది, సీతరాములుకు ప్రథమ చికిత్స నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ముదిగొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కోతి, కుక్కల దాడిలో నలుగురికి గాయాలైన సంఘటన ముదిగొండలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న నఫీసా అనే బాలికతోపాటు కూలీ పనులకు వెళ్తున్న సీతారాములుపై పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్క దాడిచేసింది. ఈ సంఘటనలో నఫీసా, సీతారాములకు గాయాలయ్యాయి. ఇంటి వద్ద పని చేస్తున్న తులసి,సంధ్యారాణి అనే మహిళలపై కోతులు దాడి చేశాయి. బాధితులు నలుగురిని స్థానిక ప్రాథమికఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి, టీకాలను వైద్యసిబ్బంది వేశారు.

కుక్కదాడిలో బాలికకు గాయాలు

బూర్గంపాడు: మండల కేంద్రమైన బూర్గంపాడులో కుక్క దాడి చేసిన ఘటనలో ఓ బాలికకు గాయాలయ్యాయి. శనివారం గౌతపురం కాలనికి చెందిన ఎస్సిక అనే బాలిక ఇంటి ముందు ఆడుకుంటోంది. ఈ క్రమంలో కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. బాలిక ముఖంతోపాటు చేతికి గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన కుక్కను తరమడానికి ప్రయత్నించగా వారిపై కూడా దాడికి పాల్పడిందని బాధితులు తెలిపారు. బాలికను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతుంది. ఇటీవల కాలంలో మండల పరిదిలో కుక్కల దాడికి పాల్పడుతున్న ఘటనలు అధికమయ్యాయని స్థానికులు చెబుతున్నారు.

లారీలు ఢీ: డ్రైవర్లకు గాయాలు

బూర్గంపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో గల జడ్పీఎస్ఎస్ ఎదురుగా శుక్రవారం రాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదంతో రెండు లారీలు దెబ్బతిన్నాయి. ఈ ఘటనతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

నేలకొండపల్లి,జూలై12(ఆంధ్రజ్యోతి)కూసుమంచివైపు నుంచి నేలకొండపల్లి వైపు వస్తున్న కారు రాజేశ్వరపురం వద్ద నాగార్జున సాగర్ బ్రిడ్జి సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోయింది. కారులోఉన్న మండ్రాజుపల్లితండాకు చెందిన పానుగోతు ఉపేందర్, బాబు గాయపడ్డారు. గాయపడ్డ వారిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. విద్యుత్ స్థంభం కారుమీద పడకపోవటంతో పెనుప్రమాదం తప్పింది.





నేడు ఏదులాపురంలో సమావేశం

ఖమ్మంరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏదులాపురం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, వై.శ్రీనివాస్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ మార్చి 29న తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం అసోసియేషన్ పూర్తికాల కమిటీని ఎన్నుకోనున్నారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఉద్యోగులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని విన్నవించారు. కార్యవర్గం ఎన్నికతో పాటు కాలనీల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

తిరుమలాయపాలెం, జూలై12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 25కుటుంబాలు చేరాయి. శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ చేరిక జరిగింది. ఈసందర్భంగా వారికి కండువాకప్పి ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు గంధ్ర గోపాలరావు, మందుల రాజీవ్, కందాల చంద్రారెడ్డి, ఏనుగు చంద్రారెడ్డి, వీరన్న, పాల్గొన్నారు.

బీజేపీలోకి..

కొణిజర్ల, జూలై12(ఆంధ్రజ్యోతి): కొణిజర్లలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో వివిధ పార్టీల నుంచి పలువురు బీజేపీలోకి చేరారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు పార్టీలో చేరిన వారికి కండువ కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారు నరేష్, మండల అధ్యక్షులు కవిడ మురళీకృష్ణ, మందనపు సుబ్బారావు, తప్పెతి నరేష్, కవిడ రాంబా బు, యాస సత్యనారాయణ, సోమథరియాసింగ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి అటెండర్లు?

ఓ అధికారికి ఒక అటెండర్ ఉండటం సహజం. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలో మాత్రం ఒకే అధికారికి ఇద్దరు అటెండర్లు ఉంటున్నారు. ఇంకాస్త ముందు కెళితే అసలు అధికారి ఛాంబర్‌కు రాకున్నా సహాయకులు మాత్రం కాపలాగా కూర్చొంటున్నారు. ఉమ్మడి జిల్లాలు విభజన,కొత్తమునిసిపాలిటీలు ఏర్పాటు సమయంలో అదనంగా ఉద్యోగులు ఉన్నారని చర్చ జరిగింది. వార్డుఆఫీసర్లు రావటం, పారిశుధ్య విభాగం, ఇతర విభాగాల నుంచి ఉద్యోగులు వచ్చారు. ఇలా అవసరానికి మించిన స్థాయిలో ఉద్యోగులు, సహాయకులు కాలక్షేపం చేస్తున్నారు. పనిలో పనిగా ఖాళీగా ఉండలేక ఇతర విభాగాల చుట్టూ తిరుగుతూ ఒక అధికారి విషయాలను మరో అధికారి చాంబర్‌కు చేరుస్తూ లీకులు ఇస్తున్నారు..

- ఒకే అధికారికి ఇద్దరు సహాయకులు
- అధికారి లేని విభాగానికీ నియామకం
- అదనంగా ఉండటంతో కొందరు కాలక్షేపం
- ఆరుగురి నుంచి 15మందికి పైగా పెరిగిన సిబ్బంది
- కేఎంసీలో వింతలీలలు


కమిషనర్ ఆదేశాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న ఈఈ సహాయకుడు, ఎస్ఈ కార్యాలయం ఎదుట సహాయకుడు

ఖమ్మంకార్పొరేషన్, జూలై12 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ ఎస్ఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికి ఖమ్మంలో పాతమునిసిపల్‌లో కార్యాలయం ఉంది. కేఎంసీలోనూ మరో ఛాంబర్ కూడా ఉంది. అయితే నెలకు ఒక్కసారి నిర్వహించి వెళుతుంటారు. ఐనా కేఎంసీలో ప్రత్యేకంగా సహాయకుడిని పెట్టుకున్నారు. ఇదే చాంబర్‌కు సమీపంలోనే ఈఈ అధికారి విభాగం ఉంది. కమిషనర్ ఆదేశాల మేరకు నియామకం చేసిన సహాయకుడు తనకు అనుకూలంగా వ్యవహరించటం లేదని, అతన్ని పక్కకు పంపి ఖమ్మం నగరంలో నీటీ కుళాయిలు పనులు చేయాల్సిన సిబ్బందిని సహాయకుడిగా పెట్టుకున్నారు. ఒక్కో ఇంజనీరింగ్ డీఈవిభాగంలో ఇద్దరు నుంచి ముగ్గురు సహాయకులను నియామకం చేసుకున్నారు.

మక్కుసూటిగా ఉంటే చుక్కలే

సాంకేతికంగా అనుభవం కలిగిన ఉద్యోగులను కార్యాలయంలోనే వినియోగిస్తున్నారు. వారికి అనుకూలంగా లేకుండా నిబంధనలు పాటించే వారికి చుక్కలు చూపుతూ డివిజన్లకు పంపుతున్నారు. గతంలో ఈఈ క్యాడర్‌కే పరిమితమైన సహాయకులు ఇప్పుడు ఏఈ క్యాడర్‌కు వినియోగిస్తున్నారు. పారిశుధ్య విభాగంలోను అవసరానికి మించిన స్థాయిలో సహాయకులు పనిచేస్తున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థలో తరచుగా కమిషనర్లు మారుతున్నారు.. కానీ పదేళ్లకుపైగా ఇంజనీరింగ్, ఎకౌంట్స్, ఎగ్జామినర్, మెప్మా విభాగాల్లోని సహాయకులు మాత్రం మారటం లేదు. కేఎంసీలో కమిషన్ల వ్యవహారంలో అధికారుల చేతులకు మరకలు కాకుండా వీరు ద్వారానే జరుగుతుందని అందుకే కొంతమంది అధికారులు వారికి అనుకూలంగా ఉండే సహాయకులను చాంబర్‌ల వద్ద విధులు కేటాయించుకుంటున్నారని చర్చ జరుగుతుంది.

ఫైల్ రహస్యంగా చేరవేసి అటెండర్

కొన్ని నెలల క్రితం ఇంజనీరింగ్ విభాగంలో ఆ అటెండర్ ఫైల్‌ను రహస్యంగా మరో కాంట్రాక్టర్‌కు ఇవ్వటంతో పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు వరకు వెళ్లింది. తర్వాత కమిషనర్ పలు మార్పులు చేస్తూ ఆదేశాలిచ్చినా ఇంజనీరింగ్ ఇతరవిభాగాల అధికారులు వాటిని పట్టించుకోలేదు. వారికి అనుకూలంగా ఉండే వారిని కేఎంసీ కార్యాలయానికి తీసుకొచ్చి నియామకం చేసుకుంటున్నారు. అవినీతిలో వీరి పాత్రే అధికమని తెలుస్తోంది.

6-15మందికి పైగా సహాయకులు

పాత మునిసిపల్ కార్యాలయంలో మేయర్, కమిషనర్, రెవెన్యూ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలకు మొత్తం ఖమ్మం నగర పాలక సంస్థలోనే కేవలం ఆరుగురు సహాయకులు విధులు నిర్వహించారు. కొత్త కార్యాలయం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, ఏఈలు, డీఈల ప్రత్యేకంగాకు ఛాంబర్‌లను కేటాయించారు. ఇంకేముందు కేఎంసీలో 15మందికి పైగా అటెండర్ క్యాడర్‌లో కేటగిరి 2 వేతనాలు పొందుతున్నారు. ఇటీవల కమిషనర్ పలు ఆదేశాలిచ్చినా వాటిలో కొన్ని అమలు కాలేదు. ఈ విషయంపై అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కు ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విచారణ చేస్తామన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం కామేపల్లి, రామక్రిష్ణపురం, కెప్టెన్‌బంజర, మద్దులపల్లి, ముచ్చర్ల గ్రామల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు రాని వారు బాధపడొద్దని తెలిపారు. విడతల వారీగా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దనియాకుల హన్మంతరావు, డీఎస్, నల్లమోతు లక్ష్మయ్య, అరెం రవి, రెడబోతు గోపిరెడ్డి, గుజ్జర్లపుడి రాంబాబు, దామోదర్‌రెడ్డి, గాదె రాంబాబు, జగన్నాథరెడ్డి, బావ్‌సింగ్, గాడేపల్లి నర్సయ్య, అజ్మీర లక్ష్మణ్, బొడ్డు లక్ష్మీనారాయణ, మద్దిన్ని రమేష్, నరిరాం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


కెప్టెన్ బంజరలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

టీఎన్జీవో కమ్యూనిటీ హాల్‌కి పార్కింగ్ స్థలాన్ని కేటాయించండి

మంత్రి తుమ్మలకు టీఎన్జీవో నేతల వినతి


మంత్రి తుమ్మలకు విన్నవిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు గుంటుపల్లి

ఖమ్మంకలెక్టరేట్, జూలై12(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో కమ్యూనిటీహాల్‌కి పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. 2000 సంవత్సరంలో టీఎన్జీవో కమ్యునిటీహాల్ నిర్మాణానికి ప్రభుత్వంస్థలం కేటాయించిందని అన్నారు. దీనిలో కొంతభాగం ప్రస్తుతం ఇప్పుడున్న టీడీపీ కార్యాలయానికి కేటాయించాచని చెప్పారు. పార్కింగ్ కోసం ఉన్న కొంత స్థలాన్ని స్థానికుల అభ్యర్థన మేరకు దేవాలయానికి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం టీఎన్జీవో కమ్యూనిటీహాల్‌లో జరుగుతున్న కార్యక్రమాలకు పార్కింగ్ సమస్య ఏర్పడుతోందని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో గుంటుపల్లి శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గంగవరపు బాలకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకరాచారి, ఆంజనేయులు, జిల్లావైస్ ప్రెసిడెంట్ కరణ్ సింగ్, మధిర యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు రుఖ్మారావు తదితరులున్నారు

నేడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమావేశం

ఖమ్మంజూలై, 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) ఐజేయూ యూనియన్ నగర మహాసభ ఆదివారం ఉదయం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరుగుతుందని యూనియన్ నగర అధ్యక్షుడు మైస పాపారావు, కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ హాజరు కానున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేసన్ ఆధ్వర్యంలో శనివారం ఓఅనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఇల్లెందులో గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు వైద్యం చికిత్సకోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో శ్రీనివాసరావు బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వనమహోత్సవంలో ఆదాయం వచ్చే మొక్కలు

- రెండెకరాల్లో వక్క మొక్కల ఉద్యానం
- ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


నర్సరీలో సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఖమ్మంలో ఆదాయానిచ్చే మొక్కలను నాటుతున్నామని, ఇందుకోస ప్రత్యేకంగా నర్సరీలను నిర్మాణం చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో రెండెకరాల ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో కంచే వేయించారు. నర్సరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో ఉద్యాన అధికారి బెల్లం రాధిక వక్క మొక్కలు పెంచితే భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుందని సూచించటంతో 800 వక్క మొక్కలను తెప్పించారు. కాగా శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వక్క మొక్కలు నాటి నర్సరీని ప్రారంభించారు.ఆదర్శ ఉద్యానవనంగా ఖమ్మం నగర పాలక సంస్థ నిర్మాణం చేస్తుందన్నారు. రైతులు అవగాహన పెంచుకొని వక్క పంటలను సాగు చేయాలని సూచించారు. వక్క సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యానవనాన్ని వక్క మొక్కల ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలోనే పంటనిచ్చే మొక్కను ఖమ్మంలో నర్సరీల రూపంలో అందుబాటులోకి తీసుకురావటం ఖమ్మం నగర పాలక సంస్థ అధికారుల ప్రత్యేకతగా పేర్కొన్నారు. మోడల్ ప్లాంటేషన్‌గా మారబోతుందన్నారు. ఇతర ఆర్గానిక్ పంటలను వనమహోత్సవంలో ఏర్పాటు చేస్తామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్, కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు పాల్గొన్నారు. తర్వాత రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేవీ బంజరలో రూ.30లక్షల రహదారులకు శంకుస్థాపనలు చేశారు.

వనజీవి స్ఫూర్తితో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


వనజీవి పేరుతో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

ఖమ్మంరూరల్, జూలై12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విత్తనం నుంచి మహావృక్షంగా వనజీవి జీవితం పేరుతో యువ రచయిత నరేష్ జెల్లా రచించిన దరిపల్లి రామయ్య జీవిత చరిత్రను హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. వనజీవి రామయ్య జీవితాన్ని పుస్తకరూపంలో తీసుకువచ్చిన నరేష్ జల్లాను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపి బలరాం నాయక్, డిప్యూటి స్పీకర్ రామచంద్రు నాయక్, రచయిత జల్లా నరేష్, వాస్విక్ ఫౌండేషన్ నిడిగొండ నరేష్ కుమార్, నూకల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

తల్లాడ, జూలై12(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ముద్దునూరు, కుర్నవల్లి గ్రామాలలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు పొలాల్లో ఉన్న ట్రాక్టర్ బ్యాటరీలను అపహరించుకుపోయారు. ము ద్దునూరు గ్రామంలోని పొలాల్లో ఉంచిన కుర్నవల్లికి చెందిన అయిలూరి కృష్ణారెడ్డి, పెద్దకృష్ణారెడ్డి, నల్లమల వెంకటనారాయణకు చెం దిన ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు తల్లాడ పోలీసుస్టేషన్‌లో యరమల వెంకటరామిరెడ్డి ఫిర్యాదు చేశారు.

సీపీఎంలో రాజకీయ శిక్షణ తరగతుల ఉత్సాహం

- స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికలకు క్యాడర్ సన్నద్ధం
- అర్బన్‌లో ప్రాంతాల వారీగా శిక్షణ కార్యక్రమాలు



మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంకార్పొరేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీపీఎంలో రాజకీయ శిక్షణతరగతుల ఉత్సహం కనిపిస్తోంది. ఖమ్మం నియోజకవర్గంలో కొంతకాలంగా క్యాడర్ పటిష్టతపై సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు దృష్టి సారించారు. ఈక్రమంలో ప్రతి ఆదివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించే స్టడి సర్కిల్‌కు తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్‌రావు, ఇతర ముఖ్యనాయకులు హాజరవుతున్నారు. మూడు దశాబ్దాలక్రితం నిర్వహించిన స్టడిసర్కిల్ వలే పూర్వవైభవం తీసుకొస్తున్నారు. కాగా నగరంలో శనివారం రెండు రోజుల రాజకీయ శిక్షణతరగతులు ప్రారంభమయ్యాయి. ఖానాపురం హవేలీ కార్యాలయంలో ఖానాపురం కమిటీతో పాటుగా రఘునాథపాలెం మండలం కమిటీల శిక్షణ ప్రారంభించారు. సుందరయ్య భవన్‌లో వన్‌టౌన్. టూటౌన్ కమిటీల శిక్షణ ఏర్పాటు చేశారు. త్రీటౌన్ కమిటీ సమావేశాలు వారం రోజుల క్రితమే పూర్తి చేశారు. రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలు,రఘునాథపాలెం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై క్యాడర్‌కు మార్గదర్శకం చేస్తున్నారు.స్థానిక సమస్యలపై సన్నద్ధం కావటం, ప్రజలతో మమేకమై గ్రామా లు, వార్డుల్లో పర్యటించి రానున్న ఎన్నికలకు సిద్ధం కావటంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ తరగతులను డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ప్రారంభించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, బండారు రమేశ్ తరగతులు బోధించారు.

ఆన్‌లైన్ పరీక్షకు 113 మంది హాజరు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీస్టడీ సర్కిల్ ఖమ్మంలో సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్)ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు 113 మంది హాజరైనట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత తెలిపారు. ఈ పరీక్ష శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల పాన్నెకల్‌లో నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 197 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 113 మంది హాజరై 84 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

సర్జికల్ బ్లేడుతో దాడి

గంజాయి మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్



కామేపల్లి, జూలై12(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఓ వ్యక్తి సర్జికల్ బ్లేడుతో నలుగురిపై దాడి చేసిన సంఘటన కామేపల్లి మండలం కొత్తలింగాలలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తలింగాలకు చెందిన రెట్టాల గోపి గంజాయి మత్తులో అదే గ్రామానికి చెందిన కొరివి నాగయ్య, గుదిమళ్ల సాయి, శ్యామ్‌కుమార్, ఎలమందల రాహుల్‌పై సర్జికల్ బ్లేడుతో దాడి చేశాడు. ఈదాడిలో నలుగురికి తీవ్రగాయలు కావడంతో వారిని ఆటోలో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన రెట్టాల గోపి పరారీ అయ్యాడు. విచ్చలవిడిగా గంజాయి తాగి అలజడి సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన పెరికకుల (పురగిరి క్షత్రియ) విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు శనివారం అందించారు. నగరంలోని వర్తకసంఘం భవనంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన 48మంది విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందించారు. మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు బంధుసూర్యం మాట్లాడుతూక్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరుతేవాలని కోరారు. ఈకార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ సాదె నాగార్జున, ముక్కెర రాంమోహన్‌రావు, ,రాకేష్, పత్తిపాక వెంకన్న, చింతల లింగేశ్వరరావు, ముత్తినేని రత్నాకర్, పత్తిపాక వెంకటేశ్వర్లు, గజ్జల వెంకన్న పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమాజంలో మార్పు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

పెనుబల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు కార్యకర్తలు, నాయకులు ప్రజలను సిద్ధం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని లంకపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘం నాలుగో మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజం మారాలంటే వర్గపోరాటాలతోనే సాధ్యమవుతుందని అందుకే వర్గపోరాటాల మార్గాన్ని వ్యవసాయ కూలీలు, పోడుసాగుదారులు, కార్యకర్తలు, నాయకులు ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు చలమాల విఠల్‌రావు, జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.మండల అధ్యక్ష, కార్యదర్శులుగా గాయం తిరుపతిరావు, చమటా విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా తడికమళ్ల చిరంజీవి, సహాయ కార్యదర్శిగా రాజినేని మం గమ్మ, సభ్యులను ఎన్నుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీకి మరణం లేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని
- తిరుమలాయపాలెం మండల మహాసభకు హాజరు

తిరుమలాయపాలెం,జూలై 12(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ ఉన్నంత వరకు కమ్యూనిజం సజీవంగా ఉంటుందని, కమ్యూనిజానికి అంతంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని కొక్కిరేణిలో సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. తొలుత పార్టీజెండాను ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు చావా వెంకటేశ్వరరావు చిత్రటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూర్జువాపార్టీలు ఎంత తొందరగా పుట్టుకొస్తాయో అదేవిధంగా అంతరించి పోతాయన్నారు. భారతదేశంలో ఎన్నో పార్టీలు వచ్చి అంతరించినా నిలకడగా ఉంది కమ్యూనిజం అన్నారు. ఈప్రాంతంలో కొక్కిరేణికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చావా వెంకటేశ్వరరావు ప్రజల పక్షాన నిలబడి పేదలకు భూములు పంపిణీ చేశారన్నారు. ఈసందర్భంగా 30 మందితో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బత్తుల రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి శివరామకృష్ణను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లానాయకులు ఎండీ మౌలానా, దండి సురేష్, పగిళ్ల వీరభద్రం, దంతాల బాలరాజు, చావ వెంకటరావు, జనార్ధన్‌రావు, ఇంటూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మండలంలోని బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మిడి హనుమంతరావు, రేపాకుల శివలింగం, ఎస్.వెంకటేశ్వర్లు, నరసయ్య బత్తుల రాధాకృష్ణ,రమేష్ పాల్గొన్నారు.





- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

స్థానిక ఎన్నికల తర్వాతనే
సంస్థాగత మార్పులు చేయండి



జిల్లా ఇన్‌చార్జ్ వంశీచంద్‌రెడ్డితో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు

వైరా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత కాంగ్రెస్ ఆదేశాల మేరకు వైరా నియోజకవర్గంలో ఆపార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియ మొదలైంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిబంధనల మేరకు నియోజకవర్గంలో సంస్థాగతంగా బ్లాక్, మండల, పట్టణ కమిటీల అధ్యక్షుల తొలగింపు, కొత్తవారి ఎంపిక చేపట్టాల్సి ఉంది. నియోజకవర్గంలో కాంగ్రెస్ సంస్థాగత కమిటీల కూర్పుపై శుక్రవారం రెండు దఫాలుగా సీడబ్ల్యూసీ సభ్యుడు, ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ చల్లా వంశీచందర్‌రెడ్డి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించి కమిటీలపై చర్చించారు. అయితే వైరా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మాత్రమే సంస్థాగతంగా మార్పులు చేపట్టాలని కోరుతూ వంశీచందర్‌రెడ్డికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వినతిపత్రం సమర్పించారు. సంస్థాగతంగా ఇప్పుడే మార్పులు జరిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశముందని, అందువలన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు నియోజకవర్గంలోని బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల మార్పులపై చర్యలు తీసుకోవద్దని కోరారు. సీడబ్ల్యూసీ నిబంధనల ప్రకారం కాంగ్రెస్ పార్టీలో గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న వారికి మాత్రమే మండల, పట్టణ అధ్యక్షులుగా ఎన్నుకునే అవకాశముంది. అలాగే ఇప్పటికే ఈ పదవుల్లో ఐదేళ్ల నుంచి కొనసాగుతున్న వారిని తప్పించి కొత్తవారిని నియమించాల్సి ఉంది.

ఇప్పుడు సంస్థాగతంగా మార్పులు జరిగితే కొన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఐదేళ్ల పైబడి ఆపదవుల్లో కొనసాగుతున్నారు. సీడబ్ల్యూసీ నిబంధనల ప్రకారం వారి స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది. అదే జరిగితే పదవి కోల్పోయిన వారు అసంతృప్తికి లోనయ్యే ప్రమాదముందని ఎమ్మెల్యే భావిస్తున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పక్షాన పార్టీ కార్యకర్తలు నిర్వహించిన తమను ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సీడబ్ల్యూసీ నిబంధనల పేరిట మార్చటాన్ని వారు జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు సంస్థాగత మార్పులు చేపట్టవద్దని వంశీచంద్‌రెడ్డికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ



ఫ్రీజర్ బాక్సు వితరణగా అందిస్తున్న దృశ్యం

ఏన్కూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): తిమ్మరావుపేట గ్రామానికి చెందిన ఉగ్గం నాగేంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శనివారం ఆమె జ్ఞాపకార్థం కుమార్తెలు, అల్లుళ్లు విజయకుమారి, వెంకటేశ్వర్లు, దొంతిబోయిన కృష్ణారావులు రూ.80వేల విలువగల శవపేటికను వితరణగా అందించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, మాజీ దిశ కమిటీ సభ్యుడు బాదావత్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమావేశం

ఖమ్మంజూలై, 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) ఐజేయూ యూనియన్ నగర మహాసభ ఆదివారం ఉదయం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరుగుతుందని యూనియన్ నగర అధ్యక్షుడు మైస పాపారావు, కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు.

మార్నింగ్ వాక్‌తో ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

» సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



గుడిపాడులో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూలై12 (ఆంధ్రజ్యోతి): గత పాలనలో మునిసిపాలిటీలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నాధుడే లేడని, తాను శ్రీకారం చుట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం పట్టణంలోని 1వ వార్డులోని గుడిపాడులో మార్నింగ్ వాక్ కార్యక్రమం ప్రతి ఇంటికి వెళ్తూ ప్రజలతో ఆప్యాయంగా పలకరిస్తూ సాగింది. పలు సమస్యలను ఎమ్మెల్యేకు స్థానికులు తెలియజేయగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆనాడు సత్తుపల్లి మునిసిపాలిటీని అవినీతి మయం చేసిన దుస్థితి ఈరోజు మన కళ్ల ముందే కనపడుతుందని, పట్టణంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంతో పాటు ముగ్గురు మంత్రుల ఆధ్వర్యంలో కృషిచేస్తూ అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఆమె హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ పార్టీ పాలనలో ఏ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం శంకుస్థాపనలకు మాత్రమే పరిమితమైందని, అందుకే నేడు 23వార్డుల్లో అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం లేక పేరుకుపోయాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కే.నరసింహ, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, అలవాల కరుణాకర్, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి తదితరులున్నారు.

వాటర్ ట్యాంకర్ల ప్రారంభం

మునిసిపాలిటీలో రూ.12లక్షల వ్యయంతో నూతనంగా కొనుగోలు చేసిన రెండు వాటర్ టాంకర్లను ప్రారంభించారు. బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద మంచి ఆరోగ్యం కోసం విక్రయిస్తున్న రాగి జావ, మిల్లెట్స్ జావను రుచి చూసి అభినందించారు. అనంతరం పట్టణంలోని 16,17వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. కల్లూరు మండలంలోని రైతులు ఏఎంసీ ఛైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి నీటిని విడుదల చేయాలని వినతిపత్రం అందజేయగా ఐబీ అధికారులతో పాటు మంత్రి తుమ్మలకు సమస్యను వివరించారు.

ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



ప్రసంగిస్తున్న చింతనిప్పు చలపతిరావు

వైరా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వరిసాగు అవసరం లేదు, యూరియా వినియోగం వద్దని బహిరంగ ప్రకటన చేసిన చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయమని తెలంగాణ రైతు సంఘం జిల్లా, పట్టణ కార్యదర్శులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు విమర్శించారు. విశ్వేశ్వర్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం వైరా మునిసిపాలిటీలోని బ్రాహ్మణపల్లి అగ్రహారం, గండగలపాడు గ్రామాల్లో జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో వరి ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందని, ఇతర రాష్ట్రాలకు, విదేశీ ఎగుమతులకు సహకారం అందించాల్సిన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి వరిసాగుపై అసహనం వ్యక్తం చేయటంతోపాటు ఆహారం లేక ఎవరూ చావటం లేదని వ్యాఖ్యానించటాన్ని తీవ్రంగా ఖండించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు వరి రైతుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేవిధంగా ఉన్నాయని అందువలన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, నాగేశ్వరరావు, ఇమ్మడి వీరభద్రం, నారికొండ అమరేంద్ర, పల్లెబోయిన కృష్ణ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమాజంలో మార్పు

» వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

పెనుబల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు కార్యకర్తలు, నాయకులు ప్రజలను సిద్ధం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని లంకపల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం నాలుగో మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజం మారాలంటే వర్గపోరాటాలతోనే సాధ్యమవుతుందని అందుకే వర్గపోరాటాల మార్గాన్ని వ్యవసాయ కూలీలు, పోడుసాగుదారులు, కార్యకర్తలు, నాయకులు ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు చలమాల విఠల్‌రావు, రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా గాయం తిరుపతిరావు, చమటా విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా తడికమళ్ల చిరంజీవి, సహాయ కార్యదర్శిగా రాజినేని మంగమ్మ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు

» సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

మధిర రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని వారికి అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇళ్లు ఇచ్చారని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ఆరోపించారు. శనివారం మధిరలోని బోడేపూడి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మందా సైదులు, శీలం నర్సింహారావు, పడకంటి మురళీ పాల్గొన్నారు.

వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆర్యవైశ్యులకు కేటాయించాలి



వంశీచంద్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్యసంఘం నాయకులు

వైరా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైరా పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని ఆర్యవైశ్యులకు కేటాయించాలని కోరుతూ వైరాకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం రాత్రి సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో ఈ వినతిపత్రం అందజేశారు. నిజాయతీగా పార్టీలో ఉంటూ నియమనిబంధనలకనుగుణంగా నడుచుకుంటామని అందువలన వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆర్యవైశ్యులకు కేటాయించాలని ఆవినతిపత్రంలో కోరారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు మిట్టపల్లి నాగి, శ్రీనివాసరావు, అనుమోలు భాస్కర్‌రావు, గ్రంధి ప్రవీణ్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

తల్లాడ, జూలై12(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ముద్దునూరు, కుర్నవల్లి గ్రామాలలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు పొలాల్లో ఉన్న ట్రాక్టర్ బ్యాటరీలను అపహరించుకుపోయారు. ముద్దునూరు గ్రామంలోని పొలాల్లో ఉంచిన కుర్నవల్లికి చెందిన అయిలూరి కృష్ణారెడ్డి, పెద్దకృష్ణారెడ్డి, నల్లమల వెంకటనారాయణకు చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు తల్లాడ పోలీసుస్టేషన్‌లో యరమల వెంకటరామిరెడ్డి ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వివక్ష లేదు



మాట్లాడుతున్న సూరంశెట్టి కిషోర్

మధిరటౌన్, జూలై 12(ఆంధ్ర జ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వానికి కానీ, కాంగ్రెస్ పార్టీకి కాని ఎటువంటి వివక్ష లేదని కొన్ని పార్టీలు కనుమరగవుతున్న తమ ఉనికిని కాపాడుకునేందుకు రాద్ధాంతం చేస్తున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. శనివారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హత కలిగి మొదటి జాబితాలో పేరు లేని వారికి తరువాత జాబితాలలో తప్పక వస్తుందని అన్నారు. గత పదేళ్లుగా ఇళ్లు ఇవ్వకపోవడం వల్ల ఒకో గ్రామంలో వంద నుంచి మూడొందల వరకు ఇళ్లు లేని వారు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందని, ఇది చూసి ఓర్వలేని వారు పేదలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీ, అద్దంకి రవి, వెంకయ్యబాబు ఇళ్లు పొందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కొణిజర్ల, జూలై12(ఆంధ్రజ్యోతి): కొణిజర్లలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో వివిధ పార్టీల నుంచి పలువురు బీజేపీలోకి చేరారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు పార్టీలో చేరిన వారికి కండువ కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారు నరేష్, మండల అధ్యక్షులు కవిడ మురళీకృష్ణ, మందనపు సుబ్బారావు, తప్పుతి నరేష్, కవిడ రాంబాబు, యాస సత్యనారాయణ, సోమథరియా సింగ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్న నెల్లూరు కోటేశ్వరరావు

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

» సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సత్తుపల్లిరూరల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): ఆనాటి అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం కోసం కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై పోరాటాలా చేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గంగారంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వర్లు, దండు ఆదినారాయణ, తడికమళ్ల యోబు, సముద్రాల సుధాకర్, బీ.సుధాకర్, పాలకుర్తి వీరయ్య, ఎర్రజ రాజశేఖర్, రామలక్ష్మి, మహాదేవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు బీమా సదుపాయం



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు శశాంక్

సత్తుపల్లిరూరల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం గ్యాస్ వినియోగిస్తున్న వారికి ప్రమాద తీవ్రతను బట్టి బీమా సదుపాయం వర్తిస్తుందని శ్రీ హనుమాన్ దత్తసాయి ఇండేన్ గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు గుండు ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కొత్తూరులోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ, గుండు శశాంక్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు 8కోట్లమంది దూరం

వైరా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలోని 8కోట్లమంది కూలీలు ఉపాధి హామీ పనులకు దూరమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు. కొండబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం వైరాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రా శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, తూము సుధాకర్, గుమ్మా నర్సింహారావు, సుంకర సుధాకర్, బాజోజు రమణ, రామచంద్రయ్య, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పొన్నం వెంకటేశ్వరరావు

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

తల్లాడ, జూలై12(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వ్యాధి నిరోధక టీకాల లాజిస్టిక్ జిల్లా మేనేజర్ వెంకటరమణ సూచించారు. శనివారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాధినిరోధక టీకాల నిలవ కేంద్రాన్ని మండలంలోని మల్సూరుతండాలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో గర్భిణీలు, ఐదేళ్లలోపు పిల్లలకు వేయించినట్టయితే వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారరు. ప్రస్తుతం పిల్లలకు 12రకాల వ్యాధులు రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని తల్లిదండ్రులంతా సకాలంలో వారికి ఇప్పించినట్టయితే పిల్లలోక్షయ, పోలియో, డిఫ్తీరియా, కంఠ సర్పి, నీళ్ల వీరేచనాలు, హెపటైటిస్, తట్టు వ్యాధి తదితర వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు ప్రస్తుతం స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలో వచ్చే డయేరియా వ్యాధిని మన ఇంటి వద్ద లభించే నిమ్మరసం, మజ్జిగ, గంజి మొదలయిన ద్రావణాలతో అరికట్టవచ్చని ఒకవేళ తగ్గకపోతే ఓఆర్ఎస్ లేదా జింక్ మాత్రలను వేసుకొన్నట్టయితే డయేరియా తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య , ఫార్మసిస్టు శ్రీనివాస్, ఏఎన్ఎంలు శిరీష, శ్రావణసంధ్య, ఆశాకార్యకర్త సరోజినిపాల్గొన్నారు.



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణ

మెహందీ వేడుకలు



శ్రీనిధి డిగ్రీ కళాశాలలో మెహందీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

మధిర రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసాన్ని పురస్కరించుకొని మధిరలోని శ్రీనిధి డిగ్రీ కళాశాలలో మెహందీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొని చేతులకు పలురకాల ఆకృతిలో గోరింటాకు పెట్టుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్సాహపూరిత వాతావరణంలో విద్యార్థినులు సందడి చేశారు. అనంతరం కార్యక్రమానుద్దేశించి కళాశాల చైర్మన్ అనిల్‌కుమార్‌నెహ్రూ మాట్లాడారు. శరీరంలోని వేడిని తగ్గించే గుణం గోరింటాకుకు ఉందన్నారు. ఆషాడమాసంలో గోరింటాకు విశిష్టతను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, జూలై12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు.. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శాస్త్రి, వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు ..



పూజలు చేస్తున్న భక్తులు

బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని వినతి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

కొణిజర్ల, జూలై12(ఆంధ్రజ్యోతి): పల్లిపాడు నుంచి భద్రాచలం వెళ్లే రహదారి మధ్య రెండు బ్రిడ్జీల నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ శనివారం కొణిజర్ల మండలానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కు జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్, రైతుసంఘం కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. తీగబంజర-లాలాపురం మధ్య, అంజనాపురం-జన్నారం మధ్య రహదారి మధ్య వాగులు వర్షాకాలంలో పొంగి రోడ్లపైనే ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరి ఎప్పుడూ కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నదని వెంటనే స్పందించి బ్రిడ్జీల మంజూరుకు కృషి చేయాలని వినతిద్వారా కోరారు.